రూ.10 లక్షల పరిహారం ఇవ్వాలి

- ఆదివాసీ గిరిజన సంఘం

ప్రజాశక్తి- అరకులోయ: అయోధ్య యాత్రకు వెళ్లి మృతి చెందిన గిరిజనుడికి గురుదేవ చారిటబుల్ ట్రస్ట్ రూ.10 లక్షల నష్టపరిహారం చెల్లించాలని ఆదివాసి గిరిజన సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పి.బాలదేవ్ డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఆదివాసులను అయోధ్య తీర్థయాత్రకు విజయనగరం జిల్లా కొత్తవలస మంగలపాలెం గురుదేవ చారిటబుల్ ట్రస్టు చైర్మన్ జగదీష్ కుమార్ ఆధ్వర్యంలో ఈనెల 2న అరకు ప్రాంతం నుండి 12 బస్సులతో సుమారు 600 మందిని తీసుకెళ్లారన్నారు. అరకువేలి మండలం పెదలబుడు పంచాయతీ గరుడగుడ గ్రామానికి చెందిన సిందరి పచ్చు (64) ఈనెల 6న బీహార్ బోర్డర్ హైవేలో ద్విచక్ర వాహనం ఢీ కొనడంతో అలహాబాద్ ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడన్నారు. ట్రస్ట్ నిర్వాహకులు దహన సంస్కార ఖర్చుల నిమిత్తం రూ.10 వేలు మాత్రమే మృతుని కుటుంబానికి ఇచ్చారన్నారు. బాధిత కుటుంబానికి రూ.10 లక్షల నష్టపరిహారం చెల్లించాలని, లేనిపక్షంలో ఆందోళన చేస్తామని ఆయన హెచ్చరించారు.

నినాదాలు చేస్తున్న ఉపాధి హామీ కూలీలు

'ఉపాధి' రోజు వేతనం రూ.600 ఇవ్వాలి

-సిఐటియు ఆధ్వర్యాన నిరసన

ప్రజాశక్తి- అరకు లోయ: ఉపాధి హామీ కూలీలకు 200 రోజులు పని కల్పించి రోజు కూలి రూ.600 ఇవ్వాలని సిఐటియు మండల కార్యదర్శి జన్ని భగత్ రామ్ డిమాండ్ చేశారు. శనివారం మండలంలోని దుమ్మగూడ గ్రామంలోని ఉపాధి హామీ పని ప్రదేశంలో సందర్శించి కూలీలతో మాట్లాడారు. ఈ సందర్భంగా కూలీలతో కలిసి నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ, మండుటెండలో పని చేస్తున్న ఉపాధి కూలీలకు కేంద్ర ప్రభుత్వం రోజు కు రూ.300 కూలి ఇస్తున్నామని చెపుతున్నా అది అమలు కాలేదన్నారు. కూలి తక్కువ పని ఎక్కువగా ఉండడంతో గిట్టుబాటు కాక కూలీలు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. గతంలో పే స్లిప్పులు ఇచ్చే వారని, ప్రస్తుతం ఇవ్వలేదన్నారు. ఎండవేడికి ప్రభుత్వం ఉపాధి కూలీలకు టెంట్లు ఏర్పాటు చేసి మజ్జిగ మంచినీరు సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. 30 శాతం వేసవి అలవెన్స్ ఇచ్చి ఆదుకోవాలని, ప్రతి 15 రోజులకు ఒకసారి పనిచేసిన కూలీలకు డబ్బులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. మెడికల్ కిట్టు అందుబాటులో ఉంచాలని కోరారు.

రోడ్డుపైనే మురుగునీరు

-డ్రెయినేజీ లేక అవస్థలు పడుతున్న గిరిజనులు

ప్రజాశక్తి -ముంచింగిపుట్టు: మండలంలోని కుమడ పంచాయతీ కేంద్రంలో మూడు రోడ్ల కూడలిలో డ్రెనేజీ లేక పోవడంతో రోడ్డుపైనే మురుగునీరు ప్రవహిస్తోంది. శుక్రవారం సాయంత్రం సుమారు రెండు గంటల పాటు ఏకధాటిగా ఈదులుగాలతో కూడిన భారీ వర్షానికి వరద నీరు రోడ్డు పైకి చేరుకొని రోడ్డంతా అస్తవ్యస్తంగా మారింది. గత కొద్దిరోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు చెత్తా చెదారమంతా రోడ్డుపైకి రావడంతో పాదాచారులు, వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గతంలో డ్రెనేజీ ఉన్నప్పటికీ సెల్ టవర్ల నిర్మాణాల కోసం వాటిని పూడ్చి వేశారు. డ్రైనేజీ మూసుకుపోయి వరద నీరంతా రోడ్లపైకి వస్తుందని గ్రామస్తులు తెలిపారు. డ్రైనేజీ విషయమై అధికారులకు పలుమార్లు తెలియజేసినప్పటికీ కనీసం స్పందించ లేదని వాపోయారు. చెత్తాచెదారం రోడ్డు పైకి రావడంతో అటుగా వెళ్లే వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, తక్షణమే అధికారులు స్పందించి సమస్య పరిష్కారం చేయాలని గ్రామస్తులు సింహాద్రి, జగదీష్, ఆదినారాయణ, ఆనందరావు, రమేష్ బాబు, భవాని శంకర్, సునీల్ కుమార్, సురేష్ కుమార్ తదితరులు కోరారు.

రోడ్డుపై నుంచి ప్రవహిస్తున్న మురుగునీటిని దాటి వెళుతున్న పిల్లలు

నేటి నుంచి పాడేరులో..

మోదకొండమ్మ ఉత్సవాలు

-శతకం పట్టులో అమ్మవారి పాదాలు.. విగ్రహం ప్రతిష్ట

-భారీ ఎత్తున సాంస్కృతిక కార్యక్రమాలు

ప్రజాశక్తి-పాడేరు: కేంద్రం పాడేరులో ఈనెల 9న ఆదివారం నుంచి మోదకొండమ్మ ఉత్సవాలు ప్రారంభం కానున్నాయి. ఈ వార్షిక జాతర మహెూత్సవాలను మూడు రోజులపాటు నిర్వహిస్తారు. పాడేరులో జరిగే ఈ జాతరకు ఏజెన్సీ నలుమూలల నుంచి వేలాది గా గిరిజనులు తరలివస్తారు. ఉత్తరాంధ్ర జిల్లాల నుంచి లక్షలాదిగా తరలివస్తున్న జన జాతరగా మోద కొండమ్మ ఉత్సవం ప్రసిద్ధి కెక్కడంతో 2016 సంవత్సరంలో రాష్ట్ర ప్రభుత్వం రాష్ట్ర గిరిజన ఉత్సవంగా గుర్తించింది. సుమారు కోటి రూపాయలు వరకు నిధులు కేటాయిస్తుండటంతో అమ్మవారి ఉత్సవం భారీ ఏర్పాట్లతో సాగుతోంది. ఈ జాతరలో భాగంగా తొలిరోజు ఆదివారం వేకువ జామున అమ్మవారి ఉత్సవ మూర్తిని, పాదాలను ఆలయం నుంచి భక్తులు అధికారులు, ప్రజాప్రతినిధులు ఊరేగించి గ్రామంలో ప్రత్యేకంగా రూపొందించే శతకంపట్టులో ప్రతిష్ఠించి అమ్మవారి ఉత్సవాలు ప్రారంభమవుతాయి. ఈ కొలువు ఉత్సవానికి వేలాదిగా భక్తులు తరలి వస్తారు. శతకం పట్టు వద్ద అమ్మవారిని కొలువు తీర్చిన తర్వాత గ్రామంలో ప్రతి ఇంటా భక్తులు అమ్మవారి ఘటాలను ప్రతిష్ఠించుకుని పూజలు చేస్తారు. ఆది, సోమ రెండు రోజులపాటు అన్ని ప్రాంతాల నుంచి భక్తులు అమ్మవారి జాతరకు తరలివచ్చి ఆలయంలోనూ, సతకం పట్టు వద్ద మోదకొండమ్మను దర్శించుకుంటాకుంటారు,..

శతకం పట్టులో కొలువు తీరే అమ్మవారి ఉత్సవ మూర్తిని, పాదాలను, అమ్మవారి ఘటాలను ప్రత్యేక రీతిలో పెద్ద ఎత్తున నేల వేషాలు సాంస్కృతిక ప్రదర్శనలతో భారీ ఊరేగింపుగా అమ్మవారి అనుపోత్సవాన్ని ఈ నెల 11న మంగళవారం నిర్వహిస్తారు. దీంతో ఉత్సవాలు ముగుస్తాయి,సుమారు ఐదారు గంటలసేపు ఈ ఊరేగింపు పురవీధుల్లో సాగుతుంది. ఉత్సవాల సందర్భంగా ఆలయ కమిటీ తరపున చైర్మన్ కొట్టగుల్లి భాగ్యలక్ష్మి, ప్రధాన కార్యదర్శి సింహచలం నాయుడు, ఉత్సవ కమిటీ గౌరవ అధ్యక్షులు టీ.నర్సింగ్ రావు, అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు కొట్టగుల్లి రామారావు, తమరభ ప్రసాద్ నాయుడు, వై.శ్రీనివాస్, వెంకటరమణ ఏర్పాట్లు చేశారు. జిల్లా కలెక్టర్ విజయ సునీత, ఎస్పీ తుహిన్ సిన్హా పర్యవేక్షణలో అధికార యంత్రాంగం ఉత్సవాల్లో భక్తులకు అవసరమైన సౌకర్యాలు కల్పించడంపై చర్యలు తీసుకున్నారు. పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు. జాతరకు పెద్దఎత్తున వినోదాత్మక కార్యక్రమాలను ఏర్పాటు చేశారు.

ఉత్సవాల సందర్భంగా మోదకొండమ్మ అమ్మవారి ఆలయాన్ని ప్రత్యేకంగా ముస్తాబు చేశారు. పూలతో ప్రత్యేక అలంకరణ మెయిన్ రోడ్ లోని శతకం పట్టు ప్రత్యేక రీతిలో తీర్చిదిద్దారు. పట్టణంలో విద్యుత్ దీపాలంకరణ నిర్వహించారు.. మోదకొండమ్మ ఉత్సవాలతో పాడేరు లో సందడి నెలకొంది.

భారీ సెట్టింగ్

ఉత్సవ సందర్భంగా విద్యుత్ వెలుగుల్లో పాడేరు పట్టణం

పెండింగ్ తునికాకు బోనస్ తక్షణమే చెల్లించాలి

సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వెంకటేశ్వర్లు

ప్రజాశక్తి-రంపచోడవరం

రంపచోడవరం నియోజకవర్గంలోని తునికాకు కార్మికులు 2014 నుండి పెండింగ్లో ఉన్న తునికాకు బోనస్ బకాయిలను తక్షనమే చెల్లించి కార్మికులకు న్యాయం చేయాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు వి వెంకటేశ్వర్లు కొత్తగా ఏర్పడే ప్రభుత్వాన్ని కోరారు. శనివారం రంపచోడవరంలో లోతా రామారావు అధ్యక్షతన జరిగిన సిపిఎం జిల్లా సమావేశంలో వెంకటేశ్వర్లు మాట్లాడుతూ రాష్ట్రం విడిపోయినప్పుడు నుండి కార్మికులకు శ్రమకు తగిన ఫలితం రావట్లేదని, అప్పుడు తెలుగుదేశం ప్రభుత్వం ఆ తర్వాత వచ్చిన వైసీపీ ప్రభుత్వంలో అనేకసార్లు బోనస్ చెల్లించాలని కోరామని, ఆందోళన చేశామని, అయినా ప్రభుత్వాలు స్పందించలేదని పేర్కొన్నారు. బోనస్ వేల కుటుంబాలకు కోట్ల రూపాయలు రావాల్సి ఉందని, ఒక్కో కుటుంబానికి రూ.50వేలు నుండి లక్ష రూపాయలు చెల్లించాల్సి ఉందని తెలిపారు. విడిపోయిన తెలంగాణలో ఇప్పటికే చెల్లించడం జరిగిందని, ఇప్పుడు ఆంధ్రలో ఏర్పడే కొత్త ప్రభుత్వం బోనస్ చెల్లింపునకు చర్యలు తీసుకోవాలని కోరారు. అరణ్య భవన్ నుండి అధికారులు కూడా స్పందించి బోనస్‌లు చెల్లింపులకు పూనుకోవాలన్నారు. బోనస్ చెల్లిస్తే గిరిజన కుటుంబాల్లో ఆర్థిక భరోసా చేకూరుతుందని, ఇదే విషయం చీఫ్ కన్జర్వేటర్‌ను రానున్న కాలంలో కలుస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఎం ఎఎస్ఆర్ రంపచోడవరం జిల్లా కార్యదర్శి బొప్పెన కిరణ్, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు మట్ల వాణిశ్రీ, నాయకులు పూనం సత్యనారాయణ, పల్లపు వెంకట్, ఐవి, సీసం నరేష్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు వెంకటేశ్వర్లు

గోదావరి వరదల సమయంలో

మెరుగైన వైద్య సేవలు అందించాలి

జిల్లా ఆసుపత్రుల సమన్వయ అధికారి డాక్టర్ కృష్ణారావు

ప్రజాశక్తి-చింతూరు

వచ్చే వర్షాకాలం గోదావరి వరదల సమయంలో చింతూరు ఏరియా ఆసుపత్రిలో ఈ ప్రాంత ప్రజలకు ఎలాంటి ఇబ్బంది రాకుండా మెరుగైన వైద్య సేవలు అందించే దిశగా వైద్యాధికారులు, సిబ్బంది పని చేయాలని అల్లూరి సీతారామరాజు జిల్లా ఆసుపత్రుల సమన్వయ అధికారి డాక్టర్ కృష్ణారావు ఆదేశించారు. చింతూరు ఏరియా ఆసుపత్రిని శనివారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వరద సమయంలో అత్యవసర మందులు ముందుగా జిల్లా డ్రగ్ స్టోర్ నుండి తెప్పించుకోవాలన్నారు. అన్ని సదుపాయాలు ఉండే విధంగా ప్రణాళికలు తయారు చేసుకోవాలని సూచించారు. వర్షాకాలంలో ఆసుపత్రి పరిసరాలు శుభ్రంగా ఉంచాలన్నారు. ప్రజలకు ఎలాంటి సమయంలోనైనా వైద్య సేవలు అందించే విధంగా చర్యలు తీసుకోవాలని ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఎంవీ కోటిరెడ్డిని ఆదేశించారు. అనంతరం ఏరియా ఆసుపత్రిలోని క్యాజువాలిటీ, ప్రసూతి, పీ.ఎన్.సీ వార్డు, ఎస్ఎన్ సీయు యూనిట్, డయాలసిస్ సెంటర్‌ను పరిశీలించారు. ఆసుపత్రిలోని అన్ని రకాల రికార్డులను కూడా ఆయన తనిఖీ చేశారు. ఈ కార్యక్రమంలో చింతూరు ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఎంవీ కోటిరెడ్డి, గైనకాలజిస్టులు డాక్టర్ వైవీ రమణారావు, డాక్టర్ శశికళ, జనరల్ మెడిసిన్ డాక్టర్ ఎం.సాయికిశోర్, ఆర్థోపెడిక్ డాక్టర్ కౌషిక్, ఇఎన్‌టి వైద్యులు డా.జ్యోతి ప్రియ భవానీ, వైద్యాధికారులు డాక్టర్ భరత్వాజ్, డాక్టర్ స్పందన, హెడ్ నర్స్ కుమారి, డీసీహెచ్ఎస్ సీనియర్ అసిస్టెంట్ లక్ష్మణ్, బ్లడ్ బ్యాంక్ ఎల్‌టి రామశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

చింతూరు ఏరియా ఆసుపత్రిలో వార్డులను పరిశీలిస్తున్న కృష్ణారావు

ఏరియా ఆసుపత్రిని సందర్శించిన డిసిహెచ్ఎస్

రంపచోడవరం : స్థానిక ఏరియా ఆసుపత్రిని డిసిహెచ్ఎస్ కృష్ణారావు శనివారం సందర్శించారు. నూతన బిల్డింగ్‌ను సందర్శించి అవసరమైన మౌలిక సదుపాయాలు గురించి బిల్డింగ్ ఇంజినీరింగ్ వారిని అడిగి తెలుసుకున్నారు. ఆసుపత్రిలో రికార్డులు, పేషెంట్ వార్డ్స్, బ్లడ్ బ్యాంకు గురించి వివరాలు తెలుసుకొని సంతృప్తి వక్తం చేశారు. ఈ కార్యక్రమంలో హాస్పిటల్ సూపరింటెండెంట్ కె.లక్ష్మి, హాస్పిటల్ స్టాఫ్, డాక్టర్స్, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

మిడ్డేమీల్స్ కార్మికుల సమస్యలను పరిష్కరించాలి

ప్రజాశక్తి -సీలేరు

మధ్యాహ్న భోజన పథకం కార్మికుల సమస్యలపై ప్రభుత్వం దృష్టి సారించి వాటిని పరిష్కారం చేయాలని సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి గిడుతూరి సత్యనారాయణ డిమాండ్ చేశారు. జీకే వీధి మండలం పూజారి పాకల గ్రామంలో మధ్యాహ్న భోజన పథకం కార్మికుల సమావేశం శనివారం జరిగింది. పలు సమస్యలపై చర్చించారు. ఈ సందర్భంగా సత్యనారాయణ మాట్లాడుతూ కనీస వేతనం అమలు చేయాలని, గుర్తింపు కార్డులు ఇవ్వాలని, ప్రతి స్కూల్‌కి వంట షెడ్ ఏర్పాటు చేయాలని కోరారు. కార్మికులకు ఇన్సూరెన్స్ అమలు చేయాలని, పెరుగుతున్న ధరలకు అనుగుణంగా మెస్ చార్జీలు పెంచాలని, వేతనాలు మొదటి వారంలో మంజూరు చేయాలని, సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో ఎపి మధ్యాహ్న భోజన కార్మికుల సంఘం మండల అధ్యక్షులు కింతర్ల కుమారి, ఉపాధ్యక్షురాలు అంకిపాటి లక్ష్మి, కార్యదర్శి సాగిన కుమారి, చిన్నతల్లి, పాంగి దావీది, పాంగి కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

సమావేశంలో పాల్గొన్న మిడ్డేమీల్స్ కార్మికులు

క్రీడల్లో రాణించాలి

ప్రజాశక్తి-కూనవరం

క్రీడల్లో రాణించి పేరు ప్రఖ్యాతలు తీసుకురావాలని ప్రముఖ ఆయుర్వేద వైద్యులు జమాల్ ఖాన్ అన్నారు. మండలంలోని పెదఆర్కూర్ గ్రామంలో శ్రీమంచంనగిరి పేరుతో ఏర్పాటు చేసిన క్రికెట్ టోర్నమెంట్ శనివారం ప్రారంభమైంది. ఈ సందర్భంగా జమాల్ ఖాన్ చారిటబుల్ ట్రస్ట్ (జే.కే.సి.టి) ద్వారా టోర్నమెంట్‌కు అవసరమైన క్రికెట్ కిట్లను జమాల్‌ఖాన్ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేటి కంప్యూటర్ కాలంలో మనిషి జీవితం కేవలం ధనార్జనకే పరిమితమైపోయిందన్నారు. గతంలో పాఠశాలలో పాఠాలతో పాటుగా మంచి ఆటలు కూడా ఉండేవని. ఆటలు క్రమేపీ కనుమరుగవుతూ ఆరోగ్యానికి దూరమవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. నేటి యువత దురలవాట్లు, చెడు వ్యసనాలకు లోనై నిర్వీర్యమవుతుందన్నారు. నేటి యువత రేపటి సమాజానికి, దేశానికి వెన్నెముకగా ఉండాలంటే యువతను కాపాడే బాధ్యత అందరిపైనా ఉందని చెప్పారు. అనంతరం టాస్ వేసి టోర్నమెంటును ప్రారంభించారు. ఈ టోర్నమెంట్‌కు సంబంధించి ప్రథమ, ద్వితీయ పురస్కారాలను జెకెసి ట్రస్టు ద్వారా అందిస్తున్నారు. ఈ కార్యక్రమంలో జెకెసి ట్రస్ట్ కార్యదర్శి ఎండి ఇమ్రాన్ ఖాన్, నాయకులు ఎడవల్లి భాస్కర్, సూఫీ, అప్పారావు, ట్రస్ట్ సభ్యులు షాజహాన్, ఎస్కే రియాజ్, ఇంతియాజ్, నటరాజ్ తదితరులు పాల్గొన్నారు.

క్రికెట్ కిట్లు అందజేస్తున్న జమాల్ ఖాన్

టిడిపి రాష్ట్ర అధ్యక్షుడిని కలిసిన శిరీషాదేవి

ప్రజాశక్తి- రాజవొమ్మంగి, రంపచోడవరం

ఇటీవల జరిగిన ఎన్నికల్లో రంపచోడవరం నియోజకవర్గం ఎమ్మెల్యేగా ఎన్నికైన మిరియాల శిరీషాదేవి శనివారం టిడిపి రాష్ట్ర అధ్యక్షులు కింజరాపు అచ్చెన్నాయుడును మర్యాదపూర్వకంగా కలసి శుభాకాంక్షలు తెలిపారు. సార్వత్రిక ఎన్నికల్లో టిడిపి, జనసేన, బిజెపి కూటమి రాష్ట్రంలో 164 ఎమ్మెల్యేలు, 21 ఎంపీ స్థానాల్లో ఘనవిజయం సాధించిన నేపథ్యంలో ఎమ్మెల్యేగా గెలిచిన శిరీషాదేవి, ఆమె భర్త, తెలుగు యువత నియోజకవర్గ అధ్యక్షులు మఠం విజయభాస్కర్ శనివారం మంగళగిరి టిడిపి ప్రధాన కార్యాలయానికి వెళ్లి అచ్చెన్నాయుడుతో పాటు మాజీ మంత్రి నక్కా ఆనందబాబు, పలువురు టిడిపి సీనియర్ నేతలను కలిసి పుష్ప గుచ్ఛాలు ఇచ్చి శుభాకాంక్షలు తెలిపారు.

అచ్చెన్నాయుడుకు శుభాకాంక్షలు తెలుపుతున్న దృశ్యం

345.90 క్వింటాళ్ల వరి విత్తనాలు సిద్ధం

ప్రజాశక్తి-రాజవొమ్మంగి : రాజవొమ్మంగి మండలానికి 345.90 క్వింటాళ్ల ఎంటియు1061 రకం వరి విత్తనాలు వచ్చినట్లు మండల వ్యవసాయ అధికారి పి.రమేష్ నాయుడు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. 50 క్వింటాళ్ల పచ్చిరొట్ట, జీలుగు విత్తనాలు, 10 క్వింటాళ్ల జనుము విత్తనాలు సిద్ధంగా ఉన్నట్లు పేర్కొన్నారు. రాజవొమ్మంగి రైతు భరోసా కేంద్రానికి 205.80 క్వింటాళ్ల వరివిత్తనాలు, జడ్డంగి రైతు భరోసా కేంద్రానికి 140.10 క్వింటాళ్లు విజయవాడ ఏపీ సీడ్స్ నుంచి, విశాఖ నుండి జీలుగు, జనుము విత్తనాలు వచ్చినట్లు ఆయన తెలిపారు. పచ్చిరొట్ట విత్తనాలు రాజవొమ్మంగిలో 20 క్వింటాళ్లు, వాతంగిలో 10 క్వింటాళ్లు, జడ్డంగిలో 20 క్వింటాళ్లు, 10 క్వింటాళ్లు జనుము విత్తనాలు సిద్ధంగా ఉన్నట్లు వెల్లడించారు. ఈ ఏడాది ఖరీఫ్ పంట నిమిత్తం1360 క్వింటాళ్లు వరి విత్తనాలు కావలసి ఉండగా ఇప్పటివరకు 841.50 వరి విత్తనాలు వచ్చాయని, మిగిలినవి మరో రెండు రోజుల్లో రానున్నాయని తెలిపారు, రైతులు విత్తనాలకు ఆధార్, పాసుబుక్ వెంట తెచ్చుకోవాలని, ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

తాగునీటి పథకానికి మరమ్మతులు చేపట్టాలి

ప్రజాశక్తి -అనంతగిరి:తాగునీటి పథకం మరమ్మతు పనులు చేపట్టి నీటిని సరఫరా చేయాలని మండలంలోని పెద్దకోట పంచాయతీ పరిధి మడ్రెబు గ్రామానికి చెందిన వెంకటరావు, ఎస్.సూకనదొరలు కోరారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, మడ్రెబు గ్రామంలో రెండు వీధిలు ఉన్నాయన్నారు. తమ గ్రామానికి తాగునీటి సమస్య తీర్చేందుకు ప్రభుత్వం మూడేళ్ల క్రితం కొండమీద ఊటగెడ్డ నుండి పైపు లైన్ ఏర్పాటు చేసిందన్నారు. కొత్త వీధి గ్రామానికి మాత్రమే ఇంటింటి కొళాయి ట్యాపులు బిగించారని, మరో వీధికు వేయలేదన్నారు. వేసిన పైపులైన్, ప్లాస్టిక్ ట్యాంకులు మరమ్మతులకు గురి కావడంతో తరచూ తాగునీటి ఎద్దడి నెలకొంటుందన్నారు. తక్షణమే అధికారులు స్పందించి పైపులైన్‌తో పాటు ట్యాపుల మరమ్మత్తు పనులు చేపట్టాలని డిమాండ్ చేశారు.

చాపరాయిని సందర్శించిన సబ్ కలెక్టర్

ప్రజాశక్తి -డుంబ్రిగుడ:పర్యాటక కేంద్రం చాపరాయి జలపాతంలో పాడేరు సబ్ కలెక్టర్ ధాత్రిరెడ్డి శనివారం సందర్శించారు. కుటుంబ సభ్యులతో కలిసి సందర్శించి సరదగా గడిపారు. చాపరాయి అందాలతోపాటు చుట్టు పచ్చని అందాలు, జలపాతంలో ఏర్పాటు చేసిన అభివృద్ధి పనులను పరిశీలించి ఆనందం వ్యక్తం చేశారు. గిరిజన మహిళలు ప్రదర్శించిన థింసా నృత్యాన్ని తిలకించిన ఆమె అభినందించారు.

చీడిగుమ్మలలో పోలీసుల కవాతు

ప్రజాశక్తి-గొలుగొండ:మండలంలోని చీడిగుమ్మల గ్రామంలో నర్సీపట్నం రూరల్ సిఐ హరి ఆధ్వర్యంలో ఎస్ఐ కృష్ణారావు శనివారం పోలీసుల కవాతు నిర్వహించారు. ఈ నెల 4న ఎన్నికల కౌంటింగ్ సందర్భంగా చీడిగుమ్మలలో వైసిపి, టిడిపి నేతల మధ్య తలెత్తిన ఘర్షణలు, దాడులతో కొట్టుకుంటు దారి తీసిన విషయం తెలిసిందే. దీంతో గొలుగొండ ఎస్ఐ కృష్ణారావు గ్రామంలో శాంతి భద్రతల దృష్ట్యా భద్రత కట్టుదిట్టం చేశారు. గ్రామంలో ఎటువంటి గొడవలు జరగకుండా అందరూ సయమనం పాటించాలని సూచించారు. అనంతరం, గుండుపాల, కె ఎల్లవరం, పప్పుశెట్టిపాలెం, గొలుగొండ, సాలిక మల్లవరం, పాకలపాడు, ఏటిగైరంపేట గ్రామాల్లో మార్చ్‌ఫాస్ట్‌ను నిర్వహించారు.

పంచాయతీకి ట్రాక్టర్ మంజూరు

ప్రజాశక్తి-నక్కపల్లి:మండలంలోని రాజయ్యపేట పంచాయతీకి ట్రాక్టర్ మంజూరైనట్లు సర్పంచ్ పిక్కి అప్పలనర్స, కార్యదర్శి రాజశేఖర్ తెలిపారు. ఈ మేరకు శనివారం ట్రాక్టర్‌ను ప్రారంభించారు. గ్రామంలో చెత్తను తరలించేందుకు ట్రాక్టర్ ఎంతగానో ఉపయోగ పడుతుందని ఆనందం వ్యక్తం చేశారు. ఇప్పటి వరకు చెత్తను బయట వేసేందుకు చాలా ఇబ్బందులు పడవలసి వచ్చిందని, ట్రాక్టర్ మంజూరుతో ఇక ఆ ఇబ్బందులు ఉండవన్నారు. గ్రామంలో పారిశుద్ధ్య నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారిస్తామని, ఎప్పటికప్పుడు చెత్తను తొలగిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్పిటిసి సభ్యురాలు కాసులమ్మ, ఎంపీటీసీ సభ్యులు పిక్కి సత్తియ్య, నాయకులు పిక్కి గంగరాజు, పిక్కి కొండలరావు, పిక్కి కోదండరావు, మైలపల్లి మహేష్ బాబు, మైలపల్లి శ్రీను, దేముడు, తాతీలు, మైలపల్లి వీర్రాజు, ప్రసాద, పిక్కి లక్ష్మణ్ పాల్గొన్నారు.

వర్షానికి ఒరిగిన విద్యుత్ స్తంభాలు

ప్రజాశక్తి- చీడికాడ:మండలంలోని పలు గ్రామాల్లో శుక్రవారం సాయంత్రం కురిసిన భారీ వర్షానికి చెట్లు విరిగి విద్యుత్ వైర్లపై పడ్డాయి. విద్యుత్ స్తంభాలు నేల కొరిగాయి. గతంలో విద్యుత్ స్తంభాలు ఏర్పాటు సమయంలో భూమిలో కాంక్రీట్ వేసేవారు. ప్రస్తుతం స్తంభాల ఏర్పాటులో కాంక్రీట్ వేయకపోవడంతో భారీ గాలి వీస్తే చాలు చాలావోట్ల విద్యుత్ స్తంభాలు వాలి పోతున్నాయి. మండలంలోని మంచాల నుండి గుంటి కొత్తూరు మీదుగా కోణం వెళ్లే రహదారిలో గుంటి కొత్తూరు సమీపాన ప్రధాన రహదారిపై తాటి చెట్టు విరిగి పడటంతో విద్యుత్ వైర్లు నేలకు ఒరిగి పోయిందేదే కాకుండా స్తంభాలు వాలిపోయాయి.వస్తైనే మరో విద్యుత్ స్తంభం భూమి పైకి పడిపోవడంతో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. ఇప్పటికైనా విద్యుత్ శాఖ సిబ్బంది స్పందించి విద్యుత్ వైర్లు ఉన్న ప్రాంతంలో చెట్లను తొలగిస్తే ఇటువంటి ప్రమాదాలు జరగవని ఈ ప్రాంతీయులు తెలిపారు.

వెంకన్న సన్నిధిలో డిఎం అండ్ హెచ్ఒ

ప్రజాశక్తి -నక్కపల్లి:ప్రసిద్ధి పుణ్యక్షేత్రమైన ఉపమాక వెంకన్నను శనివారం జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి బాలాజీ దంపతులు దర్శించుకున్నారు. ఆలయ ప్రధాన అర్చకులు గొట్టుముక్కల వరప్రసాద్ ఆచార్యులు ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్ధ ప్రసాదాలను అందజేశారు.ఆలయ చరిత్రను ఆయనకు వివరించి ,వెంకన్న చిత్రపటాన్ని బహుకరించారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

రామోజీరావుకు ఘన నివాళి

పాడేరులో నివాళి అర్పిస్తున్న పాత్రికేయులు

ప్రజాశక్తి పాడేరు: ఈనాడు అధినేత చెరుకూరి రామోజీరావు తెలుగు పత్రిక రంగానికి దిక్సూచి లాంటివారని సీనియర్ పాత్రికేయులు బి.నాగరాజు, గుర్నాథ్, శివ కొనియాడారు. పాడేరులో పాత్రికేయులు శనివారం రామోజీరావు మృతి పట్ల సంతాపం వ్యక్తం చేశారు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు.. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, పత్రికా రంగంలో ఎందరికో స్థిరమైన ఉపాధిని కల్పించారన్నారు. పత్రికా రంగం మనుగడకు రామోజీరావు ఎంతో కృషి చేశారన్నారు. తెలుగు భాషా పరిరక్షణకు, విస్తరణకు రామోజీ కృషి మరువలేనిదని చెప్పారు ఈ కార్యక్రమంలో స్థానిక పాత్రికేయులు సత్యనారాయణ, మహేష్, టీవీ9 శ్రీను, రాజేష్, కొండలరావు, తదితరులు పాల్గొన్నారు.

ఎపిడబ్ల్యుజెఎఫ్ సంతాపం

రాజవొమ్మంగి: తెలుగు నాట ప్రింట్, బ్రాడ్ కాస్ట్ మీడియాలకు సంబంధించిన ఈనాడు, ఈటీవీతో బాటు, అనేక వాణిజ్య సంస్థలను స్థాపించి కొత్త పుంతలు తొక్కించిన చెరుకూరి రామోజీరావు మృతి పట్ల ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ (ఏపిడబ్ల్యూజేఎఫ్) జిల్లా నాయకులు పి రామరాజు శనివారం ఒక ప్రకటనలో సంతాపం వ్యక్తం చేశారు. సాహితీ రంగానికి, తెలుగు భాషకు అమోఘమైన సేవ చేశారన్నారు. వాడుక భాషను వినియోగంలోకి తీసుకురావడంలో కీలక భూమి పోషించడం ద్వారా పత్రికలను పాఠకులకు చేరువచేసి పెద్ద సంఖ్యలో పాఠకులను తయారు చేసిన ఘనత రామోజీరావుకే దక్కుతుందన్నారు. ఆయన మృతి పట్ల ఏజెన్సీ జర్నలిస్ట్ జేఏసి, ఏపీడబ్ల్యూజేఎఫ్ నాయకులు రామోజీరావు కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేసారు.

దేవీపట్నం : ఈనాడు గ్రూపు సంస్థల చైర్మన్ రామోజీరావు మరణం పట్ల రాష్ట్ర బిసి సెల్ ఉపాధ్యక్షులు జెయస్. నగేష్ శనివారం ఒక ప్రకటనలో తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు. రామోజీరావు పలు రంగాల్లో వ్యాపారవేత్తగా, మీడియా సంస్థల వ్యవస్థాపకుడిగా ముఖ్యంగా తెలుగు భాషను బతికించడం కోసం ఆయన చేసిన కషి మరువ లేనిదని పేర్కొన్నారు.

పునాది దశలోనే నిలిచిన బాలికల వసతి గృహం పనులు

-మంజూరు కాని నిధులు

పునాది దశలోనే నిలిచిన వసతి గృహం పనులు

ప్రజాశక్తి-నక్కపల్లి:నక్కపల్లిలో ప్రారంభించిన బాలికల వసతి గృహ నిర్మాణ పనులు నిధులు కొరతతో ఆదిలోనే అర్ధాంతరంగా ముగిశాయి. రూ.205.44 లక్షల ఆర్ ఎంఎస్ఏ అంచనా నిధులతో బాలికల వసతి గృహ భవన నిర్మాణ పనులకు గత ఏడాది జనవరి 30న అప్పటి ఎమ్మెల్యే గొల్ల బాబూరావు భవన నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. ఈ పనులు ఆదిలోనే నిలిచి పోయాయి. బాలికల వసతి గృహానికి మోక్షమెప్పుడని విద్యార్థులు ఎదురు చూస్తున్నారు. నక్కపల్లిలో బాలికల వసతిగృహం నిర్మాణ పనులు ప్రారంభించడంతో స్థానిక బాలికల ఉన్నత పాఠశా లలో చదువుతున్న విద్యార్థినిలు, వారి తల్లిదండ్రులు ఎంతగానో ఆనందపడ్డారు. ఈ పాఠశాలలో చుట్టుపక్కల గ్రామాల నుండి పలువురు బాలికలు విద్యను అభ్యసిస్తున్నారు. ఆయా గ్రామాల నుండి బాలికలు రోజు పాఠశాలకు రాకపోకలు సాగిస్తుంటారు. వసతిగృహం నిర్మాణం చేపడితే చుట్టుపక్కల గ్రామాల నుండి వచ్చే బాలికలకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది. బాలికల ఉన్నత పాఠశాలలో చదువుతున్న విద్యార్థినిలు వసతి గృహంలో ఉండవచ్చు. అయితే భవన నిర్మాణ పనులు నిధులు కొరత లేమితో ఆదిలోనే నిర్మాణ పనులు నిలిచి పోవడంతో విద్యార్థినిలు తీవ్ర నిరాశ చెందుతున్నారు. భవన నిర్మాణ పనులు ప్రారంభించి, పునాది లెవెల్ వరకు మాత్రమే పనులు చేపట్టి పనులు నిలుపుదల చేశారు. భవన నిర్మాణానికి చేపట్టిన పునాది ప్రాంతమంతా ప్రస్తుతం చెత్త మొక్కలతో దర్శనమిస్తుంది. భవన నిర్మాణ పనులకు నిధులు మంజూరు కాకపోవడంతో కాంట్రాక్టర్ ఆదిలోనే పనులు నిలిపివేసినట్లు తెలిసింది. పనులు నిలుపుదల చేసి ఏడాదిన్నర కాలం అవుతున్నా నేటి వరకు పట్టించుకునే నాధుడే కరువయ్యారు. కొత్త ప్రభుత్వం కొలువుదీరిన తర్వాత నైనా వసతి గృహం పూర్తి చేస్తారా లేదా అని విద్యార్థినిలు ఎదురుచూస్తున్నారు.

నీలిగుంటలో తీరిన తాగునీటి సమస్య

ప్రజాశక్తి -కోటవురట్ల:మండలంలోని నీలిగుంట గ్రామంలో గడిచిన కొంతకాలంగా తాగునీటి బోరు పని చేయక పోవడంతో శనివారం స్థానిక సర్పంచ్ వరహాలబాబు పంచాయతీ నిధులతో బోరును ఆర్‌డబ్లుఎస్ సిబ్బందితో మరమ్మతు చేయించారు. గ్రామంలో తాగునీటి సమస్య తీరడంతో స్థానికులు ఆనందం వ్యక్తం చేశారు.

నేరాలు ఘోరాలు

రోడ్డు ప్రమాదంలో లారీ డ్రైవర్ మృతి

ప్రజాశక్తి -నక్కపల్లి:మండలంలోని ఒడ్డిమెట్ట జాతీయ రహదారిపై శుక్రవారం అర్ధరాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో లారీ డ్రైవర్ మృతి చెందాడు. విశాఖ నుంచి రాజానగరం వెళ్తున్న లారీ ఒడ్డిమెట్ట దగ్గరకు వచ్చేసరికి ఆగిఉన్న లారీని బలంగా ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో బీహార్‌కు చెందిన లారీ డ్రైవర్ కౌశల్ కుమార్ (22) మృతి చెందాడు. లారీ ముందు భాగం పూర్తిగా ధ్వంసం అయ్యింది. ఏఎస్ఐ రాజు కేసు నమోదు చేశారు.

కృష్ణమోహన్‌కు అభినందనలు

ప్రజాశక్తి -నర్సీపట్నం టౌన్:రాష్ట్ర బార్ అసోసియేషన్ వైస్ చైర్మన్‌గా ఎన్నికైన కృష్ణమూర్తిని నర్సీపట్నం బార్ అసోసియేషన్ సభ్యులు శనివారం మర్యాద పూర్వకంగా విశాఖపట్నంలో కలిశారు. ఈ సందర్భంగా నర్సీపట్నం కోర్టు సముదాయంలో ఉన్న పలు సమస్యలను బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ రావాడ సత్యనారయణ ఆయన దృష్టికి తీసుకువచ్చారు. దీర్ఘకాలంగా ఉన్న అదనపు జిల్లా న్యాయస్థానం ఏర్పాటు, కోర్టు సముదాయంలో మొదటి, రెండవ అంతస్తుల నిర్మాణంపై వివరించారు ఈ మేరకు స్పందించిన ఆయన త్వరలో నర్సీపట్నం కోర్టును ఉన్నత అధికారులతో సందర్శించి ఈ సమస్యలను పరిష్కరిస్తానని హామీ ఇచ్చారని తెలిపారు. ఈ కార్యమంలో సెక్రటరీ లోవరాజు, .చింతల ప్రకాష్, నాయుడు పాల్గొన్నారు.

గీతంలో పిహెచ్‌డి ప్రవేశాలకు దరఖాస్తులు

ప్రజాశక్తి -మధురవాడ : గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం విశాఖపట్నం, హైదరాబాద్, బెంగళూరు ప్రాంగణాలలో 2024-25 విద్యా సంవత్సరానికిగాను పిహెచ్‌డి ప్రవేశాలకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు గీతం రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ డైరక్టర్ డాక్టర్ సత్యనారాయణ వి.నందూరి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయంలోని ఇంజనీరింగ్, సైన్స్, ఫార్మశీ, మేనేజ్‌మెంట్, లా, సామాజిక శాస్త్ర విభాగాలలో పిహెచ్‌డి ఫుల్‌టైమ్ ప్రవేశాలకు గీతం రీసెర్చి ఎంట్రన్స్ టెస్ట్ (గ్రేట్)ను నిర్వహిస్తామని పేర్కొన్నారు. ప్రవేశ పరీక్షలో లభించే మార్కుల ఆధారంగా వ్యక్తిగత ఇంటర్వ్యూలను నిర్వహించి అర్హులైన వారికి ప్రవేశం కల్పిస్తామని వివరించారు. ఆసక్తి గల వారు గీతం వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తులను డౌన్‌లోడ్ చేసుకుని జూలై 14వ తేదీలోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తులు సమర్పించాలని తెలిపారు.

ఎమ్‌వివిఎస్.మూర్తి రీసెర్చి ఫెలోషిప్

గీతంలో పిహెచ్‌డి ప్రవేశాలు పొందిన వారిలో ప్రతిభ గల వారిని ఎంపిక చేసి వారికి నెలకు రూ.40 వేలు చొప్పున డాక్టర్ ఎమ్‌వివిఎస్.మూర్తి ఎక్సలెన్స్ రీసెర్చి ఫెలోషిప్‌ను మూడేళ్ళ పాటు అందజేస్తామని తెలిపారు. గీతం జూనియర్ ఫెలోషిప్ కింద నెలకు రూ.25 వేలు పరిశోధనా కాలంలో అందిస్తామని పేర్కొన్నారు.

డిసిఎంఎస్ పదవికి పాండ్రంకి అప్పారావు రాజీనామా

ప్రజాశక్తి -ఆనందపురం : సార్వత్రిక ఎన్నికల్లో వైసిపి ఓటమి చెందడంతో విశాఖపట్నం జిల్లా కో-ఆపరేటివ్ మార్కెటింగ్ సొసైటీ (డిసిఎంఎస్) పదవికి ఆనందపురం మండలం నేలతేరు గ్రామానికి చెందిన పాండ్రంకి అప్పారావు రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించారు. ఆనందపురం కో-ఆపరేటివ్ సొసైటీ అధ్యక్షులుగా విధులు నిర్వహిస్తున్నారు.

నీట్ ర్యాంకర్లకు సన్మానం

ప్రజాశక్తి-సీతమ్మధార : ఇటీవల విడుదలైన నీట్ ఫలితాలలో ఉత్తమ ర్యాంకులు సాధించిన ఆకాష్ ఎడ్యుకేషనల్ సర్వీసెస్ విద్యార్థులను అక్కయ్యపాలెం వద్దగల కాలేజీలో సత్కరించారు. 696 మార్కులతో 2519 ర్యాంకు సాధించిన సత్యశ్రీ సహా 32 మంది విద్యార్థులకు తెల్లకోటు, పుష్పగుచ్ఛం, మెమోంటో, పూలదండలతో సత్కరించారు. ఈ సందర్భంగా ఆకాష్ విద్యాసంస్థల డిప్యూటీ డైరెక్టర్ ఆర్‌విఎస్.మూర్తి మాట్లాడుతూ, దేశంలో మంచి ర్యాంకులు సాధించడంలో ఆకాష్ విద్యార్థులు ముందంజలో ఉన్నారు. ఆల్ ఇండియా లెవెల్‌లో 20 ఉత్తమ ర్యాంకులు సాధించి తమ ప్రతిభను చాటారని తెలిపారు. విశాఖలో 13 మంది విద్యార్థులు పదివేల లోపు ర్యాంకులు సాధించి సంస్థ ప్రతిష్టను నిలబెట్టారన్నారు. ఈ సందర్భంగా విజయోత్సవాన్ని ఉత్సాహంగా నిర్వహించారు. కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు లక్ష్మీనారాయణ, అసిస్టెంట్ డైరెక్టర్ ఈశ్వరీప్రసాద్, నిశాంత్ మిశ్రా, బ్రాంచ్ హెడ్ రాజేష్ తదితరులు పాల్గొని విద్యార్థులను అభినందించారు.

విత్తనాలు అందుకున్న గిరిజనులు

గిరిజనులకు విత్తనాల పంపిణీ

ప్రజాశక్తి - సీలేరు : జీకే వీధి మండలం దేవరపల్లి పంచాయతీ సాగుల గ్రామంలో 35 మంది గిరి రైతులకు కొర్రలు, సామలు, వరి విత్తనాలు అల్లూరి సీతారామరాజు జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో చింతపల్లి అడిషనల్ ఎస్పీ ప్రతాప్ శివ కిషోర్ చొరవతో శనివారం పంపిణీ చేశారు. గిరిజనులు ఆర్థికంగా ఎదగాలని అనకాపల్లి జిల్లా హరిపురం బిటిసి కృషి విజ్ఞాన కేంద్రం వారి సహాయంతోఈ విత్తనాలు పంపిణీ కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా విజ్ఞాన కేంద్ర సేద్య విభాగం శాస్త్రవేత్త డాక్టర్ వానా ప్రసాద్ పంటలు ఏ విధంగా పండించాలి తదితర మెలకువలుపై గిరిజనులకు అవగాహన కల్పించారు.

ఎన్ఎంఎంఎస్ స్కాలర్ షిప్‌కు ఇద్దరు విద్యార్థుల ఎంపిక

ప్రజాశక్తి-రాజవొమ్మంగి : జాతీయ మెరిట్ స్కాలర్ షిప్ (ఎన్ఎంఎంఎస్)కు మండలంలోని ఇద్దరు విద్యార్థులు ఎంపికైనట్లు స్థానిక ఎంఈఓ సురయ్య రెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని జడ్డంగి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదువుతున్న విద్యార్థిని గీతా దుర్గావాణి, లాగరాయి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదువుతున్న అశోక్ ఈ స్కాలర్ షిప్‌కు ఎంపిక కాగా, వీరికి 9వ తరగతి నుండి ఇంటర్ వరకు ఏడాదికి రూ.12 వేలు చొప్పున ప్రభుత్వం అందజేస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులకు పలువురు అభినందనలు తెలిపారు.

తాగునీటి కోసం మోటార్లు, పైపులు వితరణ

ప్రజాశక్తి-విఆర్.పురం : మండలంలోని వడ్డిగూడెం గ్రామంలో తాగునీటి సరఫరాకు అవసరమైన రెండు మోటార్లు, పైపులను జామాల్ ఖాన్ చారిటబుల్ ట్రస్ట్ ద్వారా ప్రముఖ ఆయుర్వేద వైద్యులు జామల్ ఖాన్ శనివారం అందజేశారు. వీటి విలువ రూ.77వేలు ఉంటుంది. రెండు మోటార్ల ద్వారా గోదావరి జలాలను తీసుకొచ్చి గ్రామస్తులకు తాగునీరు అందించనున్నారు. మూడు రోజుల క్రితం వడ్డిగూడెం గ్రామంలో పర్యటించిన జమాల్‌ఖాన్‌కు గ్రామస్తులు తాగునీటి ఇబ్బంది గురించి తెలియజేశారు. ఆయన వెంటనే మోటార్లు, పైపులు అందజేశారు. ఈ సందర్భంగా జెడ్పిటిసి వాళ్ళ రంగారెడ్డి మాట్లాడుతూ జమాల్ ఖాన్ అన్నమాట నిలబెట్టుకున్నారన్నారు. ఆయుర్వేద వైద్యులు జమాల్ ఖాన్ మాట్లాడుతూ తన వంతు సాయం చేస్తున్నానని, తనను చూసి మరికొందరు స్ఫూర్తిగా మారి సాటి మనిషికి సహాయ గుణం అలవాటు చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జెకెసి ట్రస్ట్ సెక్రటరీ ఎండి ఇమ్రాన్ ఖాన్, మాజీ జెడ్పిటిసి ముత్యాల రామారావు, టిడిపి మండల కార్యదర్శి ఆచంట శ్రీనివాసరావు, సర్ఫరాజ్, సూఫీ, మాజీ సర్పంచ్ చింతూరు సోడి శ్రీనివాసరావు, ట్రస్ట్ సభ్యులు ఎస్కే షాజహాన్, ఎస్‌కే రియాజ్, ఇంతియాజ్, నటరాజ్ తదితరులు పాల్గొన్నారు.

వెలుగు ఎపిఎమ్‌పై చర్యలు తీసుకోవాలి

ప్రజాశక్తి - దేవీపట్నం : కక్ష పూరితంగా నలుగురు వెలుగు సిబ్బందిని ఇబ్బందులకు గురి చేస్తున్న దేవీపట్నం మండల సమాఖ్య ఏపిఎమ్ సూరమ్మపై తక్షణమే చర్యలు చేపట్టాలని భారత ఆదివాసీ పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు తెల్లం శేఖర్ శనివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. వెలుగులో ఎమ్ఎస్‌సిసిలు గా పనిచేస్తున్న నలుగురు సిబ్బందిపై గత ప్రభుత్వ వైసీపీ నాయకుల అండతో మార్చి నెలలో విధులు నుంచి సరెండర్ చేశారని, తదనంతరం ఉన్నతాధికారులు విచారణ చేపట్టి తిరిగి విధుల్లో తీసుకోవాల్సిందిగా రెండు సార్లు ఆదేశాలు ఇచ్చినా వైసీపీ నాయకుల అండతో అధికారుల ఆదేశాలను భేఖాతరు చేశారని పేర్కొన్నారు. ఉద్యోగ భద్రతపై వారు హైకోర్టును సైతం ఆశ్రయించారని, కోర్టు ఉత్తర్వులను, ఉన్నతాధికారుల అదేశాలను బేఖాతరు చేస్తున్న ఏపిఎమ్ సూరమ్మపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

మత్స్యకార భరోసాకు మోక్షమెప్పుడో ?

లబ్ధిదారుల గుర్తింపు పూర్తయినా అందని సాయం
వేట నిషేధ కాలంలో ఆర్థిక ఇబ్బందుల్లో మత్స్యకారులు
కొత్త ప్రభుత్వం తక్షణం స్పందించాలని వేడుకోలు

తీరంలో మత్స్యకారులు (ఫైల్‌ఫొటో)

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : మత్స్యకార భరోసా కింద అందే రూ.10 వేలు కోసం గంగపుత్రులు ఎదురుచూస్తున్నారు. కొత్త ప్రభుత్వం ఏర్పడినందున తక్షణం పంపిణీ చేయాలని కోరుతున్నారు. ప్రతిఏటా మే రెండో వారంలో లబ్ధిదారుల బ్యాంకు ఖాతాలకు మత్స్యకార భరోసాను ప్రభుత్వం జమ చేసేది. ఈసారి అలా జరగలేదు. ఎన్నికల కోడ్ అడ్డంకిగా నిలిచింది. మంగళవారం ఓట్ల లెక్కింపు పూర్తవగా, ఇప్పుడు ఎన్నికల కోడ్ కూడా ముగిసింది. 12న కూటమి ప్రభుత్వ ప్రమాణ స్వీకార మహూర్తం కూడా ఖరారైంది. ఈ నేపథ్యంలో తమకు 'భరోసా' కల్పించాలని మత్స్యకారులు విజ్ఞప్తి చేస్తున్నారు.

విశాఖ జిల్లాలో మర పడవలు, ఇంజిన్ పడవలు, తెప్పలు కలిపి 2264 ఉన్నాయి. వీటిలో 695 వరకు మర పడవలు ఉన్నాయి. మిగిలినవన్నీ ఇంజిన్ పడవలు, తెప్పలు. ఫిషింగ్ హార్బర్‌తో సహా 15 ఫిష్ ల్యాండింగ్ కేంద్రాలు.. ఆయా కేంద్రాల్లోని మత్స్యకారులు, బోట్లకు సంబంధించిన సర్వే ప్రక్రియను మత్స్యశాఖ ఆధ్వర్యంలో 15 బృందాలు ఈసరికే నిర్వహించాయి. చేపల వేటపై 13,517 మంది ఆధారపడి జీవనం సాగిస్తున్నట్లు గుర్తించారు. ఆ వివరాలను మత్స్య శాఖ కమిషనర్‌కు నివేదించారు. అన్ని జిల్లాల నుంచి అందిన నివేదికలను పరిశీలించి ఆరు అంచెల గుర్తింపు ప్రక్రియను మత్స్యశాఖ కమిషనర్ కార్యాలయం ఈసరికే పూర్తి చేసింది. లబ్ధిదారులలో ఆదాయపు పన్ను చెల్లింపుదారులు, 300 యూనిట్లు దాటి విద్యుత్తును వినియోగించేవారు, ప్రభుత్వ సంక్షేమ పథకాలు లబ్ధి పొందే వారు ఉంటే భరోసా అందటం లేదు. అటువంటి వారి పేర్లు తొలగించి తుది జాబితాను ఈసరికే విడుదల చేసినట్లు తెలిసింది. ఈ జాబితా ప్రకారం మత్స్యకార భరోసా కింద రూ.10 వేల ఆర్థిక సాయం అందాల్సి ఉంది. మే రెండో వారంలో అందాల్సిన భరోసా దాదాపు నెల రోజులు కావొస్తున్నా రాకపోవడంతో మత్స్యకారులు ఆందోళనకు గురవుతున్నారు.

ఏప్రిల్ 15 నుంచి జూన్ 15 వరకు సముద్రంలో చేపల వేటపై నిషేధం ఉంది. ఇంకో వారంలో నిషేధం ముగియనుంది. దాదాపు రెండు మాసాల పాటు మత్స్య వేట లేక తీవ్రమైన ఆర్థిక ఇబ్బందులలో మత్స్యకారులు ఉన్నారు. ఈ సమయంలోనైనా మత్స్యకార భరోసా అందితే ఊరట లభించేదని, ఇప్పటికే భరోసా నిధులు అందక మరింత తీవ్ర ఆర్థిక ఇబ్బందులకు గురవుతున్నామని మత్స్యకారులు అంటున్నారు. చేపల వేట మొదలయ్యాక ఇస్తే ఏం లాభమని కొందరు ప్రశ్నిస్తున్నారు. అంతేకాకుండా జిల్లాలో 2061 మంది మత్స్యకారులను ఆయిల్ సబ్సిడీ కార్డును ఉపయోగించలేదనే నెపంతో తొలగించారని, ఇది దుర్మార్గమని అంటున్నారు. నూతన ప్రభుత్వం దీనిపై తక్షణం చర్యలు తీసుకోవాలని, మత్స్యకార భరోసాను రూ.25 వేలుకు పెంచి ఇవ్వాలని కోరుతున్నారు.

నాటక రంగానికి విశ్వవ్యాప్త ఆదరణ

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : నాటక రంగానికి విశ్వవ్యాప్త ఆదరణ ఉందని పలువురు వక్తలు అన్నారు. నవరస థియేటర్ ఆర్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో టిఎస్ఆర్ కాంప్లెక్స్‌లోని రంగ సాయి నాటక గ్రంథాలయంలో శనివారం బాల బాలికల వేసవి నట శిక్షణా శిబిరం ముగింపోత్సవం జరిగింది. దీనికి ముఖ్య అతిథిగా హాజరైన లీడర్ సంపాదకులు, రైటర్స్ అకాడమీ చైర్మన్ వివి.రమణమూర్తి మాట్లాడుతూ ఎపిలోనే నాటక రంగం పట్ల కాస్త చిన్నచూపు ఉందన్నారు. పక్క రాష్ట్రం కర్ణాటకలో నాటక థియేటర్లు ఉన్నాయని, నాటకం చూడడానికి టికెట్టు రూ.200 ఉంటుందని, నాటకం ప్రారంభానికి ముందుగానే టికెట్లు అమ్ముడు అయిపోతాయని తెలిపారు. అక్కడి ప్రభుత్వం కూడా నాటక రంగానికి మంచి గుర్తింపు ఇస్తోందన్నారు. అక్కడ పిల్లలకు నాటకానికి సంబంధించి పాఠశాలలోని క్లాసులలో ఒక తరగతి ఉంటుందని తెలిపారు. అది ఎపిలో లేకపోవడం దురదృష్టకరమన్నారు. నేడు ఇక్కడ కూడా నాటక రంగాన్ని ప్రోత్సహించాల్సిన అవసరం ఉందన్నారు. ఢిల్లీలోని ఆడిటోరియంలో ఇప్పటికీ నాటకాలు జరుగుతూ ఉంటాయని, టికెట్లు కొనుక్కొని ప్రేక్షకులు ఆసక్తితో వీక్షిస్తారని అన్నారు. ముఖ్యంగా నాటకాలను చూడడానికి యువత వస్తుంటారని చెప్పారు. ఆ నాటకాల్లో సామాజిక సందేశం ఉంటుందన్నారు. నాటకాల ద్వారా ఎన్నో జీవిత పాఠాలు నేర్చుకోవచ్చన్నారు. శ్రీదేవి, రోజారమణి వంటి వారు నాటకాలు వేసి బాల నటులుగానే సినిమా రంగంలోకి వచ్చారని గుర్తు చేశారు. నటులు, దర్శకులు నవరసమూర్తి టాలెంటెడ్ వ్యక్తి అని, 20 మంది బాలలకు కళాకారులుగా శిక్షణ ఇచ్చారని, మరింత మందిని తీర్చిదిద్దాలని, అందుకు రైటర్స్ అకాడమీ సహాయ సహకారం అందిస్తుందని తెలిపారు. ఈ ఐదేళ్లలో కరోనా ప్రభావం, ప్రభుత్వ తీరు వల్ల నాటక రంగానికి ఆదరణ లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు.

ప్రముఖ రంగస్థల నటులు, దర్శకులు కుప్పలి వెంకటేశ్వరరావు కుమారుడు, ఎయు రంగస్థల విభాగ పూర్వపు అధ్యాపకులు ప్రసాద్ మాట్లాడుతూ కన్యాశుల్కంలో ఎనిమిదో ఏట నటించానని గుర్తు చేసుకున్నారు. పిల్లలకు నాటక రంగంలో శిక్షణ ఇవ్వడం అభినందనీయమన్నారు. వారిని కళాకారులుగా తీర్చిదిద్దడం గర్వించదగ్గ విషయమన్నారు. నవరసమూర్తి, బాదంగీర్ సాయి కళా రంగానికి చేస్తున్న సేవలను కొనియాడారు. పిల్లలందరూ కళా రంగంలో మంచి పేరు ప్రఖ్యాతలు సంపాదించుకోవాలని ఆకాంక్షించారు. రంగస్థలం నటులు, దర్శకులు, కవి ప్రసాద్ మాట్లాడుతూ చిన్నారులను బాల నటులుగా తీర్చిదిద్దడంలో నవరసమూర్తి కృషి మరువలేనిదన్నారు. ఆంధ్రా బ్యాంక్ అధికారి సుబ్రహ్మణ్యం శిక్షణ పొందిన బాల నటులను, రంగసాయి నాటక గ్రంథాలయం వ్యవస్థాపకులు బాదంగీర్ సాయిని అభినందించారు.

ఆకట్టుకున్న చిన్నారి రియాన్స్ అభినయం

చిన్నారి రియాన్స్ దుర్యోధనుని ఏకపాత్ర అభినయం అందరినీ అలరించింది. పాత్రలో లీనమవుతూ పిట్ట కొంచెం కూత ఘనం అన్న చందంగా రియాన్స్ డైలాగ్స్ పలుకుతూ దుర్యోధనుని హావభావాలను ప్రదర్శించాడు. నిజంగా దుర్యోధనుడే తమ ముందుకు వచ్చారా అన్న ఫీలింగ్ వీక్షకులకు రియాన్స్ కలిగించాడు. చిన్నారి ఆది డైనోసార్ నడక, పిల్లి మొగ్గలతో నవరసాలు చేసి అలరించాడు. అలాగే కృష్ణుడు పాత్రలో కార్తికేయ, శకుని పాత్రలో రీమా, ద్రౌపది పాత్రలో నేహా, కీచకుని పాత్రలో ఎన్.విష్ణు, వాత్సాయని ఒదిగిపోయి నటించారు.

అడ్మిషన్ డ్రైవ్‌లో చిన్నారులతో ఉపాధ్యాయులు

అడ్మిషన్ డ్రైవ్ చేపట్టిన ఉపాధ్యాయులు

ప్రజాశక్తి-రాజవొమ్మంగి : ఈనెల 12 నుండి 2024-25 విద్యా సంవత్సరం ప్రారంభం కానున్న నేపథ్యంలో స్థానిక అల్లూరి సీతారామరాజు జిల్లా పరిషత్ హైస్కూల్లో విద్యార్థులను చేర్పించడం కోసం ఆ పాఠశాల ఉపాధ్యాయులు గ్రామాలలో శనివారం అడ్మిషన్ డ్రైవ్ నిర్వహించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు డివి గోపాలకృష్ణ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు గ్రామాల్లో ప్రతి ఇంటికి వెళ్లి తల్లిదండ్రులను కలిసి తమ పాఠశాలలో పిల్లలను చేర్పించాలని కోరారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు ఎం ఉదయ్, వి.రాజమ్మ, గంగాభవాని తదితరులు పాల్గొన్నారు.

పూసి పండ్లు సేకరణలో గిరిజనులు బిజీ

ప్రజాశక్తి-చింతూరు : చింతూరు ఏజెన్సీ ప్రాంతంలో అడవిలో అత్యంత అరుదైన తీయతీయగా పుల్లపుల్లగా ఉండే పూసి పండ్లు ఈ సీజన్లో విరివిగా లభిస్తాయి. పట్టణాల్లో ఖరీదైన పుల్లని ద్రాక్ష కంటే కూడా ఎంతో ఔషధ విలువలు కలిగిన సహజ సిద్ధంగా అడవిలో లభించే ఈ పూసి పళ్ళు గిరిజనులు ఎంత శ్రద్ధగా సేకరించి మండల కేంద్రానికి తెచ్చి రోడ్డు పక్కన బుట్టల్లో పెట్టి విక్రయిస్తున్నారు. చూడటానికి గోలి కాయ పరిమాణంలో ఉండి గచ్చకాయని పోలి ఉంటుంది. గట్టిగా వేళ్ళతో నొక్కి నోటితో జరుగుకుంటే మెత్తటి ముంజును పోలిన పదార్థం తీయగా పుల్లగా ఎంతో మాధుర్యం కలిగి ఉంటుంది. విటమిన్ సి ఎక్కువగా ఉండే ఈ పళ్ళల్లో మంచి ఔషధ విలువలు ఉన్నాయి. పంటి సమస్యలు చిగుళ్ళవాపు, జీర్ణ సంబంధిత రుగ్మతలను కూడా అరికట్టే అద్భుత గుణం కలిగిన ఈ పళ్ళు ఈ సీజన్లో మాత్రమే లభిస్తాయి.

రుచికి రుచి ఆరోగ్యానికి దోహదపడే ఇటువంటి పళ్ళు ఏజెన్సీ ప్రాంతంలోనే లభిస్తాయి. వీటిని చెంబు రూ.20 చొప్పున గిరిజనులు అమ్ముతున్నారు. ముఖ్యంగా మహిళలు మాత్రమే ఈ పళ్ళను సేకరించి విక్రయిస్తున్నారు. ప్రకృతి ప్రసాదించిన పూసి పళ్ళు అన్ని వయసుల వారు తినవచ్చు. ఈ పండ్లు తినడం వల్ల ఎటువంటి దుష్పరిణామాలు ఉండవు. బయటి ప్రపంచానికి వీటి పేరు కానీ వీటికి ఆరోగ్య విలువలు కానీ చాలామందికి తెలియదు. అభయారణ్యంలో ప్రకృతి సిద్ధంగా పెరిగిన పూసి చెట్లకు కాసే విలువైన పండ్లు గుత్తులు గుత్తులుగా చెట్లకు వేలాడుతుంటాయి. ఇటువంటి పళ్లు ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా తింటే ఆరోగ్యానికి ఎంతో మేలు చేకూరుతుంది.

విద్యార్థికి తీవ్ర గాయాలు

ప్రజాశక్తి-సీలేరు : గూడెం కొత్త వీధి మండలం దారకొండ పంచాయితీ పరిధి వర్తండపాడు గ్రామంలో ఓ విద్యార్థి చెట్టు పైనుంచి జారిపడి తీవ్రంగా గాయపడ్డాడు. వర్తండపాడు గ్రామానికి చెందిన కిల్లో బాబిలోనియా కుమారుడు రవి(12) వేసవి సెలవులకు సొంతూరు వచ్చాడు. ప్రతిరోజు లాగే శనివారం కూడా ఆడుకోవడానికి తన స్నేహితులతో కలిసి బయటికి వెళ్లాడు. శనివారం మధ్యాహ్నం పండ్లు కోసేందుకు ఈత చెట్టు ఎక్కాడు. పండ్లు సేకరిస్తుండగా అదుపుతప్పి ప్రమాదవశాత్తు చెట్టు నుంచి జారిపడ్డాడు. దీంతో రవి ఎడమ కాలు పై భాగం విరిగిపోయింది. కుటుంబ సభ్యులు దారకొండ ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి హుటా హుటీనా తీసుకొని రావడంతో వైద్యాధికారి డీకే హిమబిందు ప్రాథమిక చికిత్స అందించారు. అనంతరం చింతపల్లి ఏరియా ఆసుపత్రికి తరలించారు. ఈ సందర్భంగా వైద్యాధికారి మాట్లాడుతూ సెలవుల్లో పిల్లలు ఎక్కడికి వెళుతున్నారు, ఏం చేస్తున్నారనేది తల్లిదండ్రులు పర్యవేక్షిస్తుండాలని, చెట్లు, కాలువల వద్దకు వెళ్లకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఈ ఏడాది వేసవి సెలవుల్లో సుమారు పదిమంది విద్యార్థులు ప్రమాదాలకు గురై ఆసుపత్రికి వచ్చారని ఆమె తెలిపారు.